క్లుప్తంగా

తాటిముంజులకు గిరాకీ..



తాటి ముంజులు అమ్ముతున్న గీత కార్మికులు

వీరఘట్టం: ప్రస్తుతం ఎండలు మండుతున్నాయి. వేసవి తాపం తీర్చుకోవడానికి ప్రజలు చాలా రకాలైన శీతల పానీయాలు స్వీకరిస్తు న్నారు. అయితే వీరఘట్టం కొత్త బస్టాండ్‌లో మాత్రం దొరుకుతున్న తాటి ముంజులతో చాలా మంది వేసవి తాపం తీర్చుకుంటున్నారు. ధర తక్కువ రుచి ఎక్కువగా కావడంతో వీటికి మంచి డిమాండ్ నెలకొంది. వంగర మండలంలోని తలగాం, వీరఘట్టం మండలం అడారుకు చెందిన కల్లు గీత కార్మికులు తాటి ముంజులు అమ్ముతూ ఉపాధి పొందుతున్నారు.

రోడ్డు మీదే ధాన్యం రాశులు..



బొమ్మిక కూడలిలో రోడ్డు మీదే ధాన్యం బస్తాలు

భామిని: మండలంలో రబీ వరి పంట కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు పొలాల్లో నీరు ఉండడంతో ట్రాక్టర్లు కూడా దిగలేని పరిస్థితి. దీంతో పొలాల్లో హార్వెస్టర్సతో కోసి ధాన్యాన్ని సమీపంలోని ఏబీ రోడ్డుపైనే కుప్పలుగా పోస్తున్నారు. రోడ్డు కిరువైపులా ధాన్యం బస్తాలు వేయడంతో వాహన రాకపోకలకు ఇబ్బందులేర్పడుతున్నాయి.

నీరు విడుదల

పాలకొండ: వేసవి నేపథ్యంలో తోటపల్లి రిజర్వాయర్ ఎడమ కాలువ ద్వారా నీటిపారుదల శాఖ అధికారులు బుధవారం నీరు విడుదల చేశారు. ప్రస్తుతం తోటపల్లి ఎడమ కాలువ ద్వారా శివారు ప్రాంతంలోని చెరువుల్లోకి నీరు చేరుతోంది. ఇదే సమయంలో వర్షాలు కూడా కురవడంతో ఈ ఏడాది ముందుగానే చెరువులకు జలకళ సంతరించుకుంది.

నీటి వనరులున్న పొలాల్లో చెరకు పనులు




పెదంకలాంలో చెరకు విత్తనం నాటుతున్న రైతులు

సీతానగరం: మండలంలో నీటివనరులున్న గ్రామాల్లో రైతులు మట్టి సమూనా పనులు పూర్తి చేసుకుని చెరకు విత్తనం నాటే పనుల్లో నిమగ్నమయ్యారు. ఇప్పటికే రబీవరి వరిపంట కూడిక పనులు పూర్తి కావస్తున్న నేపథ్యంలో నీటి వనరులను సమకూర్చుకున్న పెదంకలాం, వెంకటాపురం, పణుకుపేట, అనంతరాయుడుపేట, బూర్జ, చెల్లన్నాయుడువలస, తామరఖండి గ్రామాల రైతులు బోదెలు తీసిన మళ్లలో చెరకు విత్తనాలు నాటుతున్నారు. ఇప్పటికే మండలంలోని 800 ఎకరాల విస్తీర్ణంలో చెరకు ప్లాంటేషన్ జరిగినట్లు వ్యవసాయాధికారి అవినాష్ ధ్రువీకరించారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం రేపు

పార్వతీపురం టౌన్: మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు శుక్రవారం అంతరాయం కలగనుందని ఏఈ రామారావు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. మండలంలోని నర్సిపురం, తాళ్లబురిడి సబ్‌స్టేషన్‌ల మరమ్మతుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనుందని పేర్కొన్నారు. నర్సిపురం, సంగంవలస, హెచ్ కారాడవలస, వెంకంపేట, ఎమ్మార్‌నగరం, పుట్టూరు, రావికోన, చినబొండపల్లి, పెదమరికి, చినమరికి, డీకేపట్నం, తాళ్లబురిడి, గోచెక్క, డోకిశీల, లచ్చిరాజుపేట, బందలుప్పి, పెదబొండపల్లి, జమదాల, లక్ష్మీనారాయణపురం, పట్టణంలోని వైకేఎం కాలనీలో ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

గుండెపోటుతో పంచాయతీ కార్యదర్శి మృతి



రాజశేఖర్ (ఫైల్)

సాలూరు రూరల్: మండలంలోని శివరాంపురం పంచాయతీ కార్యదర్శి మర్రి రాజశేఖర్ గుండెపోటుతో మృతిచెందారు. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల మేరకు యథావిధిగా తన విధులు నిర్వర్తించుకుని ద్విచక్రవాహనంపై రామభద్రపురంలోని తన ఇంటికి చేరుకుని ఇంట్లో కుర్చీలో కూర్చుని ఉండగా గుండెపోటు రావడంతో మృతి చెందారు. ఆయనకు భార్య, ఏడేళ్ల కొడుకు ఉన్నారు.

మహిళా ఓటర్లే కీలకం

- ఎన్నికల్లో గెలుపోటములపై లెక్కలు కడుతున్న వైనం
- విజయగంపై పూర్తి విశ్వాసంతో వైఎస్సార్‌సీపీ శ్రేణులు



ఓటు వినియోగించుకునేందుకు బారులు తీరిన మహిళలు(ఫైల్)

పాలకొండ రూరల్: సార్వత్రిక ఎన్నికల్లో కీలకమైన పోలింగ్ ప్రక్రియ సజావుగా పూర్తయ్యింది. మరికొద్ది రోజుల్లో ఫలితాలు వెలువడనుండడంతో అంతటా ఒకటే చర్చ జరుగుతోంది. బరిలో నిలిచిన అభ్యర్థులు, వారి మద్దతుదారులు గెలుపోటములపై లెక్కలు వేసుకుంటున్నారు. విభిన్న రాజకీయ పరిస్థితులకు నెలవైన పాలకొండ నియోజకవర్గంలో ఓటింగ్ సరళిపై మండలాల వారీగా విశ్లేషణ చేస్తున్నారు. తాజా ఎన్నికల్లో 1100 కొత్త ఓటర్లు నమోదయ్యారు. దీంతో ఈ ఏడాది నియోజకవర్గంలో 1,95,020 మందికి ఓటు వేసేందుకు అర్హత లభించింది. ఇందులో 1,46,781 (74.02 శాతం) మంది ఓటు వేశారు. ఓటుహక్కు వినియోగించుకున్న వారిలో పురుషులు 71,777 మంది (49 శాతం), స్త్రీలు 74,990 మంది (51 శాతం) ఉన్నారు. పురుషులతో పోల్చుకుంటే మహిళా ఓటర్లు 3,213 మంది (2 శాతం) ఎక్కువ కావడం విశేషం. ఈ క్రమంలో మండలాల వారీగా చూస్తూ సీతంపేట మండలంలో మొత్తం ఓట్లు 45,195 కాగా 36,192 మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. అలాగే భామినిలో 38,003 మందికి 27,193.. పాలకొండ మండలంలో 37,233 మందికి 28,049.. పాలకొండ నగర పంచాయతీలో 23,068 మందికి 16,131.. వీరఘట్టం మండలంలో 51,521 ఓటర్లకు గాను 39, 216 మంది ఓటు వేశారు. తొలినుంచీ మహిళా ఓటర్లు వైఎస్సార్‌సీపీకి మద్దతుగా ఉండడంతో వైఎస్సార్‌సీపీ నాయకులు విజయంపై సంపూర్ణ విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు.

పాలకొండ మండల పరిధిలో ఓటింగ్ వివరాలు..		
గ్రామం పేరు	మొత్తం ఓటర్లు	పోలైన ఓట్లు
ఎల్.ఎల్.పురం	1,358	899
లుంబూరు	1,441	1,111
పెదకోటిపల్లి	633	419
గుడివాడ	268	230
ఓని	1,066	826
గరుగుబిల్లి	303	251
వెలగవాడ	1,397	1,045
పీఆర్.రాజుపేట	343	275
సిరికొండ	155	145
సింగన్నవలస	778	624
పరుశురాంపురం	424	348
భాసూరు	1,902	1,123
వీపీ.రాజుపేట	608	435
అర్ధలి	784	583
తుమరాడ	1,001	799
అట్టలి	691	504
తంపటాపల్లి	1,888	1,543
టీకే.రాజపురం	607	424
బుక్కూరు	1,350	884
చిన మంగళాపురం	1,651	1,154
యరకరాయపురం	658	528
గొట్ట మంగళాపురం	1,478	1,116
గోపాలపురం	1,322	1,093
అన్నవరం	887	734
కొండాపురం	1,522	1,178
అంపిలి	1,127	904
పొట్లి	851	680
బెజ్జి	576	409
టీడీ.పారాపురం	483	376
అవలంగి	900	649
జీ.వెంకటాపురం	355	292
నవగాం	874	698
పనుకువలస	932	700
దుగ్గి	383	303
వాటపాగు	1,116	836
ఎస్.పారాపురం	218	174
చింతాడ	807	431
పద్మాపురం	312	236
ఎం.సింగుపురం	1,357	954
మల్లివీడు	706	601
డోలమడ	770	582
బద్దుమాసింగి	951	853

సమయాన్ని సద్వినియోగం చేసుకోండి



క్యారమ్ ఆడుతున్న విద్యార్థులు

గరుగుబిల్లి: మండల కేంద్రంలోని శాఖాగ్రంథాలయంలో వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా బుధవారం విద్యార్థులకు కథలు, చిత్రలేఖనం, చెస్, క్యారమ్స్, తదితర పోటీలు నిర్వహించారు. విజేతలను గ్రంథాలయ నిర్వాహకుడు మధుసూదనరావు అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసవిలో విద్యార్థులు సమయాన్ని సద్వినియోగం చేసుకునేలా స్థానిక శాఖా గ్రంథాలయంలో ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా విద్యార్థులకు కథలు, కవితలు, పుస్తక పఠనం, చిత్రలేఖనం, క్విజ్, చెస్, క్యారమ్స్, తదితర వాటిలో శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. జూన్ 7వ తేదీ వరకు నిర్వహించే ఈ శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందజేత



బహుమతులు అందుకున్న విద్యార్థులతో గ్రామపెద్దలు

జియ్యమ్మవలస: మండలంలోని బాసంగి గ్రామంలో 2023–24 విద్యాసంవత్సరంలో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు బుధవారం సన్మాన కార్యక్రమం చేపట్టారు. ఎక్కువ మార్కులు సాధించిన విద్యార్థులకు బహుమతులతో పాటు మెమెంటో అందజేశారు. విద్యార్థులను ప్రోత్సహించేందుకు గాను గత మూడేళ్లగా ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. గ్రామంలో చిన్న వయస్సులోనే చార్టెడ్ అక్కౌంటెంట్‌గా ఎంపికైన వినోద్‌కుమార్, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న గేదెల నరసింహ, వైజాగ్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో సోషల్ ఫ్యాకల్టీగా పనిచేస్తున్న మూడడ్ల చంద్రశేఖర్ అందించిన సహకారంతో ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నామన్నారు.

రేబిస్ ప్రాణాంతకం



గుంపులుగా తిరుగుతున్న కుక్కలు

- పెరుగుతున్న కుక్కకాటు బాధితులు
- సకాలంలో స్పందించకుంటే ప్రాణాలకు ముప్పు

గుమ్మలక్ష్మీపురం: జంతువుల నుంచి మనుషులకు వచ్చే అతి ప్రాణాంతక వ్యాధి రేబిస్. అత్యంత ప్రమాదకరమైన వైరస్ వ్యాధుల్లో రేబిస్ ఒకటి. దీనినే లిస్సా హైడ్రోఫోబియా అని కూడా అంటారు. రేబిస్ నివారణకు ప్రయత్నాలు జరుగుతున్నా..నేటికీ అదుపులోకి రాకపోగా, చాలా మంది ప్రాణాలను హరిస్తోంది. ఈ వ్యాధి సోకిన జంతువులు కరవడం వల్ల మనుషులకు కూడా వ్యాధి వ్యాపిస్తుంది. పిచ్చికుక్క కరవడం ద్వారా వచ్చే ఈ వ్యాధికి సకాలంలో చికిత్స అందిస్తే ప్రాణాపాయం నుంచి బయటపడవచ్చని భద్రగిరి సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి రవికుమార్ తెలిపారు. రేబిస్ వ్యాధి ఎలా వస్తుంది. దాని లక్షణాలు, నివారణ మార్గాలను ఆయన వివరించారు.

వ్యాధి వ్యాప్తి

రేబిస్ వ్యాధి రెబ్డోవైరస్ వల్ల వస్తుంది. ఈ వ్యాధి సోకిన పశువు, జంతువు కరవడం వల్ల ఇది వ్యాప్తి చెందుతుంది. సాధారణంగా పిచ్చికుక్క కరవడంతో ఈ వ్యాధి మనుషులకు సోకుతుంది. వ్యాధి సోకిన కుక్కలలో కళ్లు, ముక్కు నుంచి లాలాజలం కారుతుంది. దానిలో ఉన్న వైరస్ ఆ జంతువు కరిచిన ప్రదేశం నుంచి రక్తం, నాడీ వ్యవస్థ ద్వారా మెదడుకు చేరుతుంది.

వ్యాధి లక్షణాలు

రేబిస్ సోకిన కుక్క ప్రతి ఒక్కరినీ విచక్షనా రహితంగా కరుస్తూ యజమానిని గుర్తించలేదు. రాళ్లు, కర్రలు తదితర వాటిని తినడానికి ప్రయత్నిస్తుంది. కళ్లు ఎర్రబడి నోటి నుంచి చొంగ విపరీతంగా కారుతుంది. గొంతు, కండరాలకు పక్షవాతం వచ్చి గొంతు బొంగురుపోతుంది. ఆహారం తినదు. నీళ్లు తాగలేదు. పిచ్చి పరుగులు తీయడం, అరుపులో మార్పు రావడం, గోడలను రుద్దుకుంటుంది. దవడలు బిగుసుకుపోతాయి. రేబిస్ సోకిన జంతువుకి కింద దవడ వేలాడుతుంది. వ్యాధి లక్షణాలు అంతగా కనిపించవు. ముందుగా పక్షవాతం లక్షణాలు కనిపిస్తాయి. మనుషుల్లో కూడా ఇటువంటి లక్షణాలే కనిపిస్తాయి. నీటిని చూసి భయపడతారు(హైడ్రోఫోబియా).

ఇతర పశువుల్లో లక్షణాలు

మేత తినకపోవడం, మందకొడిగా ఉండడం, కనుపాక పెద్దది కావడం, కళ్ల వెంట నీరు కారడం, చొంగ, కదిలికలో మార్పు, నడవలేకపోవడం, పక్షవాతం, చిక్కిపోవడం, మరణం సంభవించడం ప్రధాన లక్షనాలుంటాయి. ఈ వ్యాధి ఎక్కువగా కుక్కలు, ఆవులు, పిల్లులు, గేదెలకు సోకవచ్చు.

వ్యాధి నివారణకు చర్యలు

ఈ వ్యాధికి చికిత్స లేదు. వ్యాధి నిరోధక టీకాలు(పోస్టుబైట్) వేయించుకోవాలి. రేబిస్ సోకిన కుక్క, అడవి జంతులుల ద్వారా అయిన గాయాలకు వెంటనే చికిత్స చేయించాలి. యాంటీ రేబిస్ ఇమ్యునో గ్లాబ్యులిన్స్ ఇప్పించాలి. కుక్క కరిచిన గాయాలను శుభ్రంగా డిటర్జెంట్ సోపుతో కడగాలి. తక్షణమే యాంటీ రేబిస్ ఇమ్యునోగ్లాబ్యులిన్స్ ఇంజక్షన్ ఇవ్వాలి. యాంటీ రేబిస్ పోస్టుబైట్ కోర్స్ 0, 3, 7,14 ,28, 90 రోజులు క్రమం తప్పకుండా వ్యాక్సిన్ వేయించుకోవాలి.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత తప్పనిసరి

- పశుసంవర్ధక శాఖ ఎ.డి ప్రభా మాణిక్యరావు





పాలకొండ రూరల్: ప్రస్తుత వేసవి చివరలో కురిసే అడపాదడపా వర్షాల కారణంగా గొర్రెల్లో వచ్చిన సీజనల్, సాధారణ వ్యాధులు వాటి నివారణ చర్యలపై పాడిరైతులు, పెంపకందారులు అవగాహన పెంచుకోవాలని పశు సంవర్ధకశాఖ సహాయ సంచాలకుడు (ఎ.డి) ప్రభా మాణిక్యరావు అన్నారు. లేనిపక్షంలో జీవాలు మృత్యువాత పడే అవకాశం ఉందన్నారు. వివిధ రకాల క్రిమి, కీటకాల వల్ల వ్యాధులు సంక్రమిస్తాయని తెలిపారు. గొర్రెల పెంపకందారులు సరైన సమయంలో సమస్యలు గుర్తించి, వైద్యుల సూచనలు పాటించాలన్నారు. ఈ మేరకు సీజనల్ వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

సూక్ష్మజీవుల ద్వారా...

సూక్ష్మజీవుల వల్ల చిటుకు వ్యాధి(ఈటీ), అంత్రాక్స్ లేదా నల్లజాడ్యం, ఊపరితిత్తుల్లో నెమ్ము లేదా నెమోనియా, పొగాళ్లు లేదా బురద పుండ్లు, మితువకాళ్లు, గొంతువాపు వ్యాధుల సంభవిస్తాయి. గాలికుంటు, నీలి నాలిక, బొబ్బరోగం, అమ్మతల్లి, నోటి పుండ్లు వంటివి వైరస్ ద్వారా ఒకదాని నుంచి ఇంకొకదానికి చేరి మందకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది. తేలికపాటి వర్షాలు కురిసేటప్పుడు క్లాస్ట్రీడియం జాతి సూక్ష్మజీవుల వల్ల ఎక్కువ ప్రమాదం చోటు చేసుకుంటుంది. బలిష్టంగా, ఆరోగ్యంగా ఉండే గొర్రెలు ఒక్కసారిగా ఎగిరిపడి కొట్టుకుని మరణించడం.. కడుపును కాళ్లతో తన్నడం.. కడుపు ఉబ్బడం.. నల్లగా దుర్వాసన వచ్చే పారుడు.. నోటి నుంచి నురగ రావడం.. ఫిట్స్ వంటి లక్షణాల ద్వారా ఈ రోగాలను గుర్తించవచ్చు. ఈ సమస్యలకు చికిత్స అందించే క్రమంలో వైద్యుల సలహా మేరకు రోగ పరిస్థితిని బట్టి ఆక్సిట్రిటెట్ సైక్లిన్ మందును 5 నుంచి 10 మిల్లీగ్రాములు ఒక కిలో బరువుకు లెక్కకట్టి గొర్రెలకు అందించాలి. 50 మిల్లీగ్రాముల పొటాషియం పర్మాంగనేట్ 100 ఎం.ఎల్ నీటిలో కలిపి తాగించాలి. రోగనివారణకు అవసరమగు టీకాలు కూడా అందుబాటులో ఉంటాయి. ప్రభుత్వ పశువైద్య కేంద్రాల్లో ఈ టీకాలను ఉచితంగా అందిస్తారు. మూడు మాసాల వయస్సు నిండిన గొర్రెపిల్లలకు తప్పనిసరిగా నట్టల నివారణ మందు ఇవ్వాలని, మొదటి టీకా ఇచ్చిన 15 రోజుల తర్వాత బూస్టర్‌డోస్ ఇవ్వాల్సి ఉంటుంది. ప్రతి ఏటా మే నెల మొదటి వారంలో క్రమం తప్పకుండా టీకాలు వేయించాలి.

ఏపీఆర్‌జేసీకి ఎంపిక

జియ్యమ్మవలస: మండలంలోని చినమేరంగి గ్రామానికి చెందిన మేరంగి సందీప్‌కుమార్ ఏపీఆర్‌జేసీకి ఎంపికయ్యాడు. ఇటీవల గత నెలలో నిర్వహించిన ప్రవేశ పరీక్షలో 100కు 87 మార్కులు సాధించి సత్తా చాటాడు. సందీప్‌కు తల్లిదండ్రులతో పాటు ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందనలు తెలియజేశారు. నిరుపేద కుటుంబం కావడంతో విద్యార్థి చదువుకు స్థానిక ఆంగ్ల ఉపాధ్యాయుడు నర్సింహ చౌదరి ఆర్థికంగా సాయం చేస్తున్నాడు.

ఎరువులు అందించేందుకు చర్యలు

పాలకొండ: ఈ ఏడాది ఖరీఫ్‌లో రైతులకు ఎరువులు అందించేందుకు వ్యవసాయ శాఖాధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు గ్రామాల వారీగా ఇండెంట్ సిద్ధం చేసి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించినట్లు ఆ శాఖ ఎ.డి రత్నకుమారి తెలిపారు. జూన్ నెలలో విత్తనాలు వేసే సమయంలోనే ఎరువులు కూడా అందిస్తామని తెలిపారు.

మిగిలిన పనులపై దృష్టి

వీరఘట్టం: నెల రోజులుగా అలుపెరగకుండా ఎలక్షన్ విధులు నిర్వహించిన వీఆర్‌ఓలు, కార్యాలయ సిబ్బంది ఇక నుంచి మిగిలిన పనులపై దృష్టి సారించాలని తహసీల్దార్ కె.జయప్రకాష్ సూచించారు. బుధవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో వీఆర్‌ఓలు, సిబ్బంది సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నీటితీరువా వసూళ్లు వేగవంతం చేయాలలన్నారు. అలాగే భూ సమస్యలు ఉంటే పరిష్కరించాలని సూచించారు. సమావేశంలో డీటీ సత్యనారాయణ, ఆర్‌ఐ లక్ష్మణనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణ మందు పిచికారీ



దోమల నివారణా మందు పిచాకారీ చేస్తున్న సిబ్బంది

సీతంపేట: మండలంలోని పలు గ్రామాల్లో దోమల నివారణ మందు (ఏసీఎం 5 శాతం) బుధవారం పిచికారీ చేశారు. కోసంగి, బుడ్డడుగూడ, వంబరెల్లి, సంకిలిగూడ గ్రామాల్లో గిరిజనుల ఇళ్లలో పిచికారీ చేసి ప్రజలకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మలేరియా నివారణ సబ్ యూనిట్ ఆఫీసర్ జె. మోహనరావు మాట్లాడుతూ.. మలేరియా, డెంగీ వంటి వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ప్రతి కుటుంబం తమ ఇంటిలో దోమల నివారణ మందు పిచికారీ చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ సచివాలయ సిబ్బంది, హెల్త్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఎన్నికల ఫలితాల వరకూ 144 సెక్షన్



మాట్లాడుతున్న ఎస్సై ఎం.రాజేష్

సీతానగరం: మండలంలో సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరగడానికి సహకరించిన ప్రజానీకానికి ఎస్సై ఎం.రాజేష్ ధన్యవాదాలు తెలియజేశారు. ఈ మేరకు బుధవారం ఆయన పోలీస్‌స్టేషన్‌లో మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వచ్చే వరకూ గ్రామాల్లో నిషేధాజ్ఞలు అమలులో ఉంటాయన్నారు. జూన్ 4న ఓట్ల కౌంటింగ్ జరగనున్నందున అంతవరకూ మండలంలోని 35 పంచాయతీలకు సంబంధించిన 62 పోలింగ్ బూత్‌ల ఈవీఎంలను ఉన్నతాధికారుల పర్యవేక్షణలో గట్టి బందోబస్త్ మధ్య సీజ్ చేసి భద్రపరిచినట్లు చెప్పారు. జూన్ 4 వరకూ గ్రామాల్లో 144 సెక్షన్ అమలులో ఉంటుందని స్పష్టం చేశారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాల్లో రాజకీయపార్టీల కార్యకర్తలు, అభిమానులు ఎటువంటి కవ్వింపు చర్యలకు పాల్పడినా చర్యలు తప్పవన్నారు. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావివ్వకుండా ప్రజలందరూ సహకరించాలని కోరారు.

గ్రామాల్లో గొడవలు జరగకుండా చర్యలు

పార్వతీపురంటౌన్: గ్రామాల్లో ఎటువంటి గొడవలు జరగకుండా చర్యలు చేపట్టామని పార్వతీపురం రూరల్ సీఐ రవికుమార్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికల్లో ప్రశాంతంగా ప్రజలందరూ ఓటు వేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్ అమలులో ఉందని, జూన్ 4న జరగనున్న ఓట్ల లెక్కింపు వరకు గ్రామాల్లో ఎటువంటి గొడవలు, అల్లర్లుగాని చేయకుండా..ఎటువంటి విద్వేషాలు రెచ్చగొట్టకుండా ఉండాలని విజ్ఞప్తి చేశారు.

వెంకంపేటలో ఫ్యామిలీ డాక్టర్ వైద్యసేవలు



వెంకంపేటలో వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ శ్రీకాంత్

పార్వతీపురంటౌన్: పార్వతీపురం మండలంలోని వెంకంపేట గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరం నిర్వహించినట్లు డాక్టర్ శ్రీకాంత్ తెలిపారు. ఫ్యామిలీ ఫిజీషియన్ విధానంలో 72 మంది రోగులకు బుధవారం వైద్య సేవలు అందించామని చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎఫ్‌పీసీ విధానంలో ప్రతి గ్రామంలో నెలకు రెండు సార్లు వైద్యసేవలు అందిస్తున్నామని, ప్రతి పీహెచ్‌సీలో ఇద్దరు వైద్యాధికారులు ఉండడం వల్ల ఒకరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మరొకరు ప్రజల వద్దకు వెళ్లి వైద్య సేవలు అందిస్తారన్నారు. గ్రామాల్లో మంచానపడి ఉన్న వృద్ధులు, గర్భిణులు, బాలింతల ఇళ్ల వద్దే వైద్యసేవలు అందించినట్లు తెలిపారు.

గ్రామాల్లో దాదాపు 13 రకాల వైద్యసేవలు అందిస్తున్నామని, 67 రకాల మందులు, 14 రకాల డయాగ్నోస్టిక్ సేవలు అందుబాటులో ఉంటాయని చెప్పారు. ఎనిమిది రకాల రక్త పరీక్షలు నిర్వహించి రోగులకు నెలకు సరిపడా మందులను ఉచితంగా అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, 104 వాహన సిబ్బంది, ఆశ కార్యకర్తలు ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

షెడ్యూల్ ప్రకారం టీకాలు తప్పనిసరి



టీకా కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి టి.నారాయణ

పార్వతీపురంటౌన్: షెడ్యూల్ ప్రకారం అర్హులైన చిన్నారులకు టీకాలు తప్పనిసరి అని పార్వతీపురం మన్యం జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి టి.నారాయణ అన్నారు. ఈ మేరకు పార్వతీపురం మండలంలోని బాలగుడబ గ్రామంలో వ్యాధినిరోధక టీకా కార్యక్రమాన్ని ఆయన బుధవారం తనిఖీ చేశారు. షెడ్యూల్ ప్రకారం టీకాకు అర్హులైన పిల్లలు, గర్భిణులకు, గడువు తేదీలోగా వేయాలని చెప్పారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సకాలంలో టీకాలు వేయాలని, వ్యాక్సిన్ పరిమితి చూసి వేయాలని కోరారు. గ్రామంలో పిల్లల టీకా పూర్తయిన వెంటనే రికార్డులో నమోదు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. అదేవిధంగా తల్లిదండ్రులు కూడా తమ పిల్లలకు సమయానికి టీకా వేయించాలని, సరైన పోషకాహారం అందించాలని, ఎండలో పిల్లలను తిరగనివ్వరాదని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్‌లు జయగౌడ్, నాగమ్మ, ఏఎన్ఎం రామలక్ష్మి, సీహెచ్‌ఓ జగదీష్, సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.